సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 14 । అక్టోబర్ । 2023



చిరుధాన్యాలతో ఆరోగ్యం

చిరుధాన్యాల వినియోగం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని జీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శైలజ సూచించారు. IIలో



బంతి రైతుకు ఊరట

పాడేరు మార్కెట్లో కాటుకు బంతికి మంచి ధర లభించింది. బుట్ట పూలను రూ.80కు కొనుగోలు చేశారు. IIలో



పెరుగుతున్న చలి గాలులు

మన్యంలో చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. మరోపక్క పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. IIలో

న్యూస్‌రీల్

ఆపత్కాలంలో ఆత్మబంధువులా..

- బాసటగా నిలిచిన గ్రామ వలంటీర్ దేముడు
- ఆధార్ కేంద్రానికి డోలీలో గిరి మహిళ తరలింపు



కలిమను డోలీలో మోసుకొని తీసుకు వెళ్తున్న దేముడు

అనంతగిరి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్లు గ్రామాల్లో బాసటగా నిలుస్తున్నారు. ఆపద సమయంలో మేమున్నామంటూ బాధితులకు భరోసా ఇస్తున్నారు. మండలంలోని గుమ్మపంచాయతీ కర్రిగుడ గ్రామానికి చెందిన గిరిజన మహిళ కలిమ(46) అనారోగ్యం కారణంగా కొద్దిరోజులుగా ఆమె మంచానికే పరిమితమైంది. ఆమె ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించేందుకు ఆ ప్రాంత గ్రామ వలంటీర్ దేముడు ఎంతో శ్రమించాడు. కుటుంబసభ్యుడి సాయంతో కర్రిగుడ గ్రామం నుంచి దట్టమైన అటవీప్రాంతం గుండా కలిమను సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర డోలీలో మోసుకొని గుమ్మపంచాయతీ కేంద్రానికి తీసుకువచ్చాడు. అక్కడ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ప్రత్యేక శిబిరంలో ఆమె ఆధార్ అప్‌డేట్ చేసిన తరువాత మళ్లీ గ్రామానికి డోలీలో మోసుకొని తీసుకువెళ్లాడు. కష్టకాలంలో అండగా నిలిచిన వలంటీర్ దేముడిని పలువురు అభినందించారు.

దాడి చేశారని సీఆర్టీ ఫిర్యాదు

రంపచోడవరం: అనపర్తికి చెందిన ఇద్దరు వ్యక్తులు తనపై దాడికి పాల్పడ్డారని మారేడుమిల్లి మండలం బోదులూరు స్కూల్‌కాంప్లెక్సు సీఆర్‌టీ దూడ కమలాకర్‌బాబు రంపచోడవరం ఏఎస్పీకి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా తాను నివాసం ఉంటున్నానని ఆయన తెలిపారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు వచ్చి అనపర్తి కోర్టులో దాఖలు చేసిన కేసుకు ఎందుకు హాజరు కావడం లేదని దాడి చేయడమే కాకుండా కులం పేరుతో దూషించారని ఆయన వివరించారు. వారినుంచి తనకు ప్రాణ హాని ఉందని ఏఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు.

గొర్రెలు, మేకలకు భలే గిరాకీ



అరకు వారపు సంతకు తీసుకువచ్చిన గొర్రెలు, మేకలు



మార్కెట్లో నాటుకోళ్లు

డుంబ్రిగుడ: దసరా పండగ నేపథ్యంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో గొర్రెలు, మేకలు, కోళ్లను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చారు. ఒడిశా ప్రాంతం నుంచి విక్రయానికి తీసుకు రావడంతో సందడి నెలకొంది. తుని, విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన వ్యాపారులు భారీగా వచ్చారు. గొర్రె సైజును బట్టి రూ.10వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలికింది. మేక రూ.10 వేల నుంచి రూ.30వేలకు అమ్ముడు పోయాయి. నాటు కోళ్ల ధరలు భారీగా పెరిగాయి. రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు ఒకొక్కకోడిని కొనుగోలు చేశారు.

గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి అరెస్టు



గంజాయి సాగు నిందితులతో ఎస్‌ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ జాకరవలస ప్రాంతంలో గంజాయిని సాగు చేస్తున్న కిల్లో దామోదర్ (43), లోకోయి విశ్వనాథం (56)ను శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో 20 సెంట్లలో 150 గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ముందస్తు సమాచారం మేరకు వెళ్లి పరిశీలించగా గంజాయి సాగు చేస్తున్నట్టుగా రుజువైందని ఆయన వివరించారు. వెంటనే ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోటి ఆశలతో..



బర్లీ సాగుకు మడులను సిద్ధం చేస్తున్న రైతులు

- ఖరీఫ్‌లో బర్లీ సాగు చేపట్టిన రైతులు
- ఆశాజనకంగా పైరు
- ఎకరాకు రూ.50 వేలకు పైగా ఆదాయం వచ్చే అవకాశం
- రబీకి నారుమళ్లు సిద్ధం

మంచి ఆదాయాన్నిచ్చే పంటల్లో బర్లీ పొగాకు ఒకటి. రాజవొమ్మంగి పరిసర మండలాల్లోని మెట్ట ప్రాంతాల్లో ఈ పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 1500 ఎకరాల్లో సాగు చేపట్టగా, కొద్ది రోజుల్లో రబీ నాట్లు వేసేందుకు నారును సిద్ధం చేసుకున్నారు. పైరు ఏపుగా పెరగడంతో రైతుల్లో లాభాల ఆశలు చిగురిస్తున్నాయి.



ఏపుగా పెరిగిన బర్లీ పొగాకు తోట

రాజవొమ్మంగి: వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున ఖరీఫ్‌లో బర్లీ పొగాకు సాగు చేపట్టిన రైతుల్లో లాభాల ఆశలు చిగురిస్తున్నాయి. రాజవొమ్మంగితోపాటు పరిసర ప్రాంతాలైన జడ్డంగి, గొంటువానిపాలెం, చెరుకుంపాలెం, కాకరపాడు, కొయ్యూరు, కృష్ణదేవిపేట, కొమ్మిక, అనకాపల్లి జిల్లాలో నాతవరం మండలాల్లో ఏటా ఖరీఫ్‌లో సుమారు 1500 ఎకరాల్లో సాగు చేపట్టారు. కొద్దిరోజుల్లో ప్రారంభం కానున్న రబీలో రెండు వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు నారును సిద్ధం చేసుకున్నారు.

అందుబాటులో మార్కెటింగ్

వాణిజ్య పరంగా ఇతర పంటలతో పోలిస్తే మార్కెటింగ్ అందుబాటులో ఉన్నందున మంచి ఆదాయమే వస్తోందని రైతులు చెబుతున్నారు. రైతులు పండించిన పొగాకును ఐటీసీ, ఎంఎల్ కంపెనీలు వందకిలోలు బేళ్లుగా కొనుగోలు చేస్తున్నాయి. వారం రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని ఆయా కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

ఎకరాకు రూ.40 వేలకు పైగా పెట్టుబడి

ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.45 వేల వరకు పెట్టుబడి అవుతోందని రైతులు తెలిపారు. కూలి ధరలు పెరిగిన నేపథ్యంలో ఇంటిల్లపాది కష్టపడితే కాస్త తగ్గుతుందని వారు పేర్కొన్నారు. పొగాకు నాట్లు, కోత, ఆరబెట్టడం, బేళ్లుగా తయారీ తదితర పనుల ద్వారా స్థానికంగా ఉపాధి పొందుతున్నారు.

నారుమడుల తయారీపై అవగాహన

నారుమడులు తయారీపై ప్రైవేట్ కంపెనీలు రైతులకు అవగాహన కల్పిస్తున్నాయి. పొగాకు నారు మడి వేయాలనుకునే రైతులకు వీబీహెచ్ 8, వీబీహెచ్3, వీఐఎన్. వైబీ22 విత్తనాలు ఇచ్చినట్టు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

రూ.60 వేల వరకు ఆదాయం



బర్లీ పొగాకు సాగు చేపట్టిన రైతులు నష్టపోయే పరిస్థితి ఉండదు. ఎకరాకు 800 నుంచి వెయ్యి కిలోల వరకు దిగుబడి వస్తుంది. గతేడాది కిలో రూ.115 ధర లభించగా ఎకరాకు రూ.90 వేల నుంచి లక్ష వరకు వచ్చింది. పెట్టుబడి పోను సుమారు రూ.50 నుంచి రూ.60 వేల వరకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది సీజన్ కలిసొచ్చే పరిస్థితి ఉంది.

– నక్కా వరప్రసాద్, రైతు, రాజవొమ్మంగి.

ఇతర పంటల కన్నా నయం



బర్లీ పొగాకు సాగు ఇతర పంటలకన్నా నయమనే చెప్పాలి. ప్రైవేట్ కంపెనీలు కొనుగోలు చేయడం వల్ల మార్కెటింగ్ పరమైన ఇబ్బందులు లేవు. కష్టపడితే తప్పనిసరిగా ఫలితం ఉంటుంది. ఇంటిల్లపాది కష్టపడితే మంచి ఆదాయం పొందవచ్చు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున దిగుబడులు బాగానే వస్తున్నాయి.

– మండా నూకరాజు, బర్లీ రైతు, రాజవొమ్మంగి

ప్రజలతో మమేకమయ్యేలా..



పార్టీ ముఖ్యులతో సమావేశమైన వైవీ సుబ్బారెడ్డి..చిత్రంలో డిప్యూటీ సీఎంలు బూడి, పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స, ధర్మాన ప్రసాద్‌రావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్

- 26 నుంచి ఉత్తరాంధ్రలో సామాజిక బస్సు యాత్ర
- ఉత్తరాంధ్ర మంత్రులు, పార్టీ జిల్లా అధ్యక్షులతో వైవీ సుబ్బారెడ్డి, బొత్స సమీక్ష

సాక్షి, విశాఖపట్నం: రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ వ్యూహరచన చేస్తోంది. దీనిలో భాగంగా బస్సు యాత్రకు ముహూర్తం ఫిక్స్ చేసింది. సామాజిక బస్సు యాత్ర పేరిట రాష్ట్రమంతా పర్యటించాలని ప్రణాళిక రూపొందించారు. ఈ బస్సు యాత్రను ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభించాలని పార్టీ నేతలు నిర్ణయించారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణల ఆధ్వర్యంలో శుక్రవారం ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాత్రలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసిన విషయంతో పాటు.. జరిగిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. మహిళలకు, దళితులకు, వెనబడిన వర్గాల వారికి సీఎం వైఎస్ జగన్ చేసిన మేలు.. వెనుకబడిన వర్గాలకు ప్రధాన పదవులు కేటాయించిన విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే భవిష్యత్తులో మరింత సువర్ణపాలన రానుందని ప్రజలకు వివరించాలన్నారు. ఈ రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ నాయకత్వం ఎంత అవసరమో ఈ బస్సు యాత్ర ద్వారా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంలు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, పాలవలస విక్రాంత్, మజ్జి శ్రీనివాస్, కోలా గురువులు, బొడ్డేడ ప్రసాద్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి , వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి పాల్గొన్నారు.

16న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాక

విశాఖలో ఇన్ఫోసిస్, పరవాడలో యుజియా ఫార్మా, లారస్ ల్యాబ్‌లకు శ్రీకారం



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 16న విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. రుషికొండలో ఇన్ఫోసిస్ ఐటీ కంపెనీని ప్రారంభిస్తారు. అనంతరం పరవాడలోని జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీలో అరబిందో యాజమాన్యం నిర్మించిన యుజియా (ఈయూజీఐఏ) పరిశ్రమను ప్రారంభించి, లారస్ ల్యాబ్ యాజమాన్యం తలపెట్టిన కొత్త పరిశ్రమ నిర్మాణానికి భూమి పూజ చేస్తారు. ఈ మేరకు శుక్రవారం పర్యటన షెడ్యూల్ ఖరారు చేశారు. 16వ తేదీ ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నెం.2కు చేరుకుని ఇన్ఫోసిస్ ఐటీ డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అక్కడ ప్రసంగించిన అనంతరం నుంచి 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.15 గంటలకు పరవాడ చేరుకుంటారు. పది నిమిషాల పాటు ప్రజాప్రతినిధులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీలో గల యుజియా స్టెర్లీ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకుని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారెస్ ల్యాబ్‌కు చేరుకుని యూనిట్–2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈఓ, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అనంతరం 2.35 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు తిరుగు పయనమవుతారు.

ప్రజలకు సేవలు మరింత చేరువ

వినతి ఇచ్చిన వెంటనే పరిష్కారం



ఈయన పేరు కిముడు సన్యాసిదొర, జి.మాడుగుల గ్రామం. ఈయనకు తండ్రి మరణాంతరం సంక్రమించిన ఆర్వోఎఫ్ఆర్ పట్టాదారు పాసుపుస్తకంలో 70 సెంట్లకు బదులుగా ఏడు ఎకరాలుగా రికార్డు అయింది. దీనివల్ల ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. సవరణకు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. జగనన్నకు చెబుదాంలో వినతి పత్రం అందించిన వెంటనే రికార్డుల్లో సవరించి వెంటనే సమస్య పరిష్కరించారు. ఈయన మాదిరిగానే చాలా మంది జి.మాడుగులలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతులు అందజేసి సత్వర పరిష్కారం పొందారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ప్రజా సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- జగనన్నకు చెబుదాంలో 305 వినతులు స్వీకరణ

జి.మాడుగుల: సమస్యలు పరిష్కరించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం అధికార యంత్రాన్ని జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలకు మరింత చేరువ చేసిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాలకు చెందిన గిరిజనులు కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో 305 వినతులు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, జిల్లా అధికారులంతా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. స్వీకరించిన వినతుల్లో అధికశాతం పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ శాఖలకు సంబంధించినవి ఉన్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వొమ్ము చేయకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. స్వీకరించిన వినతుల పరిష్కారానికి సంబంధించి వెనువెంటే విచారణ చేపట్టి పరిష్కరించాలని ఆదేశించారు.

వినతుల్లో కొన్ని..

- పాడేరు నియోజకవర్గంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని, ప్రతీ మండలంలో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేసి సురక్షితమైన తాగునీరు సదుపాయం కల్పించాలని, బొయితిలిలో పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- కాఫీ ప్రొక్యూర్‌మెంట్ మిషనరీ, కలెక్షన్ సెంటర్, మిలెట్స్ మిషనరీ మంజూరు చేయాలని కోరుతూ శ్రీమత్స్య దేవత ఎఫ్‌పీవో మార్కెట్స్ లిమిటెడ్ బోర్డు సభ్యులు వినతిపత్రం సమర్పించారు.
- నేరేడువలస గ్రామంలో రోడ్డు, విద్యుత్ , తాగునీటి సమస్యలపై వినతులు అందజేశారు.

గిరిజనుల్లో ఆనందం

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కొంతమంది వినతులు పరిష్కారం కావడంతో గిరిజనుల్లో ఆనందం నెలకొంది. ఎంపీపీ కె పద్మ, తహసీల్దార్ కె అప్పలస్వామి, ఎంపీడీవో ఆర్.లోహిత్ జయసాగర్ పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి మరమ్మతులు చేపట్టాలి



కుంబిడిసింగి పంచాయతీ సంగం గ్రామంలోని పాఠశాల భవనం పాడవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం అందజేశా. భవన మరామ్మతులకు యుద్ధప్రాతిపదికన ప్రతిపాదనలు పంపి సమస్య పరిష్కరిస్తామని చెప్పడం ఎంతో సంతోషంగా ఉంది.

– వెంకటరావు, సంగం గ్రామం, జి.మాడుగుల మండలం

ప్రజలకు సుస్థిర సేవలు అందేలా ఏసీబీ కృషి

దొండపర్తి: ప్రభుత్వం నుంచి ప్రజలకు అందాల్సిన సేవలలో అవినీతికి ఆస్కారం లేకుండా సుస్థిరమైన ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరే విధంగా అవినీతి నిరోధక శాఖ నిరంతరం కృషి చేయాలని డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం అవినీతి నిరోధక శాఖ రేంజ్(విశాఖ, అనకాపల్లి, అల్లూరి)కు చెందిన అధికారులతో డీజీపీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవినీతి రహిత పాలన అందేలా చూడాల్సిన బాధ్యత ఏసీబీపై ఉందని స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా ఏసీబీ 14400 కాల్ సెంటర్, ఏసీబీ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులపై సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. ప్రభుత్వ శాఖల్లో అవినీతి నిర్మూలనే లక్ష్యంగా నిరంతర నిఘాలో భాగంగా ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన అధికారులను గుర్తించడం, నిరంతర తనిఖీలు, ఆకస్మిక తనిఖీలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతిపై ప్రజల నుంచి వస్తున్న ఆరోపణలపై విచారణ, సంభందిత అధికారులను గుర్తించడం వంటి చర్యలను చేపట్టాలన్నారు. పెండింగ్ కేసులలో దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. అదే విధంగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడిన నిందితుల నేరాన్ని న్యాయస్థానంలో పూర్తి సాక్ష్యాధారాలతో నిరూపించి సకాలంలో నిందితులకు శిక్ష పడేలా చూడాలని సూచించారు.

రైతులకు 2,734.01 టన్నుల ఎరువులు సరఫరా

మార్క్‌ఫెడ్ డీఎం రమేష్



రాజవొమ్మంగి: జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ రైతులకు ఇప్పటివరకు 2,734.01 టన్నుల రసాయన ఎరువులను సరఫరా చేసినట్టు మార్క్‌ఫెడ్ డీఎం కె.రమేష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 20 రైతు భరోసా కేంద్రాలు, మరో 35 పీఏసీఎస్‌ల ద్వారా వీటిని పంపిణీ చేశామని చెప్పారు. వరి పంట కాలం ముగిసే నాటికి మరో 500 టన్నుల ఎరువులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామన్నారు. ఆర్‌బీకేల ద్వారా 20 టన్నుల ఎన్‌పీకే, 477.50 టన్నుల డీఏపీ, 25 టన్నుల ఎంవోపీ, 1549.89 టన్నుల యూరియా సరఫరా చేసినట్టు ఆయన పేర్కొన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా 35 టన్నుల ఎన్‌పీకే, 163 టన్నుల డీఏపీ, 124 టన్నుల ఎంవోపీ, 339.2 టన్నుల యూరియా సరఫరా చేసినట్టు చెప్పారు. ఎన్‌పీకే బస్తా రూ.1200, డీఏపీ రూ.1350, ఎంవోపీ రూ.1700, యూరియా రూ.260కు విక్రయించినట్టు ఆయన వివరించారు. ఈ ఏడాది జిల్లాలో 50 వేల హెక్టార్లలో వరి సాగవుతుండగా ప్రస్తుత సీజన్‌లో 500 టన్నుల మేర ఎరువుల విక్రయం పెరిగిందని డీఎం తెలిపారు.



పొలానికి ఎరువులు వెదజల్లుతున్న రైతు

ఆల్ ఇండియా స్పోర్ట్స్ మీట్‌లో పూర్ణిమ ప్రతిభ

- షటిల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమ స్థానం సాధించిన జెన్‌కో ఉద్యోగిని



మోతుగూడెం: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా విభాగం షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో సీలేరు కాంప్లెక్స్ ఉద్యోగి పూర్ణిమ సత్తా చాటారు. మోతుగూడెంకు చెందిన ఈమె ప్రథమస్థానం సాధించారు. డబుల్స్ విభాగంలోనూ ఆమె విజయవాడ విద్యుత్ సౌధ ఉద్యోగిని భారతితో కలిసి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానం సాధించారు. ఆమెను స్థానిక చీఫ్ ఇంజనీర్ శ్రీధర్, పలువురు ఉనసతాధికారులు అభినందించాం.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

చింతపల్లి: చిరుధాన్యాల వినియోగం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త శైలజ సూచించారు. మండలంలోని గాడిదలమెట్టలో శుక్రవారం అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా పోటీలు నిర్వహించారు. గిరిజనులు పండించిన వివిధ రకాల ధాన్యాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో చిరుధాన్యాలకు మరింత గిరాకీ పెరుగుతుందన్నారు. గిరిజనులు వీటి సాగుకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. ప్రపంచవ్యాప్తంగా చిరుధాన్యాల వినియోగానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. భూసార శాస్త్రవేత్త శ్రీహరిరావు మాట్లాడుతూ పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 50 మంది మహిళా రైతులకు బహుమతులు అందజేశారు.

పెరుగుతున్న చలిగాలులు


పొగమంచుతో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనచోదకులు

- దట్టంగా పొగమంచు
- నమోదవుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

సాక్షి, పాడేరు: మన్యంలో చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. మరోపక్క పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. పాడేరు.అరకులోయ, చింతపల్లి, లంబసింగి, మినుములూరు ప్రాంతాల్లో ఉదయం 9గంటల వరకు పొగమంచు దట్టంగా కురిసింది. పాడేరు, అరకు వారపు సంతలు మంచు ముసుగులోనే జరిగాయి. శుక్రవారం అరకులోయ కేంద్ర కాఫీబోర్డు వద్ద 17.9, పాడేరు మండలం మినుములూరు కేంద్రకాఫీ బోర్డు వద్ద 18, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 18.5 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం


వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్


రోగులకు ఇచ్చే మందులు పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. శుక్రవారం పాత పాడేరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు, పౌష్టికాహారం స్టాళ్లను ఆయన పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో అందిస్తున్న వైద్య సేవల వివరాలను వారి నుంచి తెలుసుకున్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే రోగులకు భోజన సదుపాయం కల్పిస్తున్నామన్నారు. పాత పాడేరులో హాజరైన రోగులకు సరఫరా చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు మద్యం, దూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి సమతుల్య ఆహారం తీసుకుంటే నిండు ఆరోగ్యంతో ఉండవచ్చని సూచించారు. కంటితోపాటు సాధారణ వైద్యపరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. 350 మంది వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ మురళి, వైద్యుల బృందం సభ్యులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ ఎం. శివరామకృష్ణ, డాక్టర్ జాఫర్ హుస్సేన్, డాక్టర్ కాటంరాజు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారని, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖకు తరలిస్తామన్నారు. ఈ సందర్భంగా శిబిరంలో మందులను పరిశీలించారు. ఎంపీపీ బడుగు రమేష్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గాడి నాగమణి, జిల్లా పార్టీ కార్యదర్శి గాడి సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు బాబులు,వైస్ ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

అరకులోయ రూరల్: మాదల పంచాయతీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో 293 మందికి వైద్య పరీక్షలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతంలో పాల్గొని పసుపు, కుంకుమ తదితర సామగ్రి అందజేశారు. వైద్యులు నాయక్, పివి వివేక్, వైద్యాధికారి కమలకుమారి, ఎంపీడీవో వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, కన్వీనర్ సంపత్‌కుమార్, యువజన విభాగ జిల్లా అధ్యక్షులు కిరణ్‌కుమార్, వైస్ ఎంపీపీ రామన్న,ఎంపిటీసీ సభ్యుడు రాంచందర్, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని తిమ్మాపురంలో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని, పేదలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని కోరారు. శిబిరంలో 272 మందికి వైద్య పరీక్షలు చేశారు. 20 మంది వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మెరుగైన వైద్యసేవలు కోసం రిఫర్ చేశారు. ఎంపీడీవో ఎం.రంగారావు, వైస్ ఎంపీపీ వెంకట రమణ, జెసీఎస్ కన్వీనర్ మోహన్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ గంగా తదితరులు పాల్గొన్నారు.

అరకు డిగ్రీ కళాశాలలో సీట్ల పెంపు

- విద్యాశాఖ కమిషనర్ ఆమోదం
- ఎమ్మెల్సీ రవిబాబు వెల్లడి

అరకులోయ టౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు సీట్లు పెంపునకు విద్యాశాఖ కమిషనర్ అంగీకరించినట్లు ఎమ్మెల్సీ కుంభా రవిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. పొలిటికల్ సైన్స్‌లో 20 సీట్లు, కామర్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో 15 చొప్పున మొత్తం 65 సీట్లు పెంచేందుకు అంగీకరించారన్నారు. త్వరలో డిగ్రీ కళాశాలకు ఉత్తర్వులు పంపిస్తామని విద్యాశాఖ కమిషనర్ చెప్పినట్టు ఆయన పేర్కొన్నారు.

డ్రోన్ కెమెరాలతో గంజాయి సాగు గుర్తింపు


డ్రోన్ సహాయంతో గుర్తించిన గంజాయి సాగు

ఎస్‌ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: గంజాయి సాగు నిర్మూలనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు.శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కుంతుర్ల, కిముడుపల్లి, వనభంగి, పెదకోడాపల్లి, జామిగుడ తదితర ఆరు పంచాయతీల పరిధిలో కొండవాలు, బయటకు కనిపించని ప్రదేశాల్లో గంజాయి సాగు చేస్తున్నట్టు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయా ప్రాంతాలను డ్రోన్ కెమెరాల సహకారంతో గుర్తించామని చెప్పారు. ప్రస్తుతం నెలరోజుల మొక్క దశలో గంజాయి సాగు ఉందన్నారు. ఇందుకు సంబంధించి సాగుదారుల వివరాలను సేకరిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేస్తామని చెప్పారు. గంజాయికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ పంటలు వేయాలని ఇప్పటికే గ్రామాల్లో ప్రచారం చేశామని, ముందుకు వచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో సహకారం అందించామని ఆయన పేర్కొన్నారు


జామిగుడ పంచాయతీ కొండవాలు ప్రాంతంలో డ్రోన్ ఉపయోగిస్తున్న పోలీసు సిబ్బంది

బంతి రైతుకు ఊరట

- మార్కెట్లో పెరిగిన ధర
- బుట్ట రూ.80కు కొనుగోలు


బుట్ట బంతిపూలు

సాక్షి,పాడేరు: గత రెండు వారాల నుంచి ధర లేక ఆదాయం కోల్పోతున్న సీతమ్మ కాటుక రకం బంతి రైతులకు శుక్రవారం పాడేరు మార్కెట్లో పరిస్థితులు ఊరటనిచ్చాయి. డోకులూరుకు చెందిన ఓ గిరిజన వ్యాపారి వేకువజామున బుట్ట రూ.80కు కొనుగోలు చేయడంతో అదే ధర మార్కెట్లో కొనసాగింది. మిగతా వ్యాపారులు కూడా అదేధరు కొనుగోలు చేయడంతో గిరి రైతుల్లో ఆనందం నెలకొంది. ఉదయం 9 గంటల వరకు వ్యాపారం జరిగింది. రాజమండ్రి, విజయవాడకు చెందిన వ్యాపారులు భారీగా వచ్చి బంతి పూలను కొనుగోలు చేశారు.

ఉద్యోగుల సంఘ ఎన్నికలకు కసరత్తు


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

మోతుగూడెం: అప్పర్ సీలేరు బ్రాంచ్ కమిటీ ఎన్నికలు ఈనెల 27న నిర్వహించేందుకు నిర్ణయించామని 1104 యూనియన్ రీజినల్ కమిటీ మీటింగ్ రీజినల్ ప్రెసిడెంట్ వై. సత్తిబాబు, రీజినల్ కార్యదర్శి వేమగిరి కిరణ్ తెలిపారు. శుక్రవారం డొంకరాయి 1104 యూనియన్ కార్యాలయంలో సీలేరు కాంప్లెక్స్ 1104 యూనియన్ రీజినల్ కమిటీ సమావేశం అధ్యక్షతన జరిగింది. డొంకరాయి బ్రాంచ్ కమిటీ 28న, మోతుగూడెం బ్రాంచ్ కమిటీ ఎన్నికలు 31న జరిపేందుకు నిర్ణయించారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి జే. ధారబాబు, జెన్‌కో వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్ కుమార్, రీజినల్ కమిటీ మెంబర్లు, మూడు బ్రాంచ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు సమావేశానికి హాజరయ్యారు. బ్రాంచ్ ఎన్నికలు, మెంబర్ షిప్ వసూలు, రీజినల్ ఎన్నికలు, రాష్ట్ర కమిటీ ఎన్నికలపై చర్చించారు. యూనియన్ సభ్యురాలు పి.పూర్ణిమ జాతీయ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా బంగారు పతకం సాధించినందుకు వారు అభినందనలు తెలిపారు. సీలేరు కాంప్లెక్స్‌లో ఉద్యోగ కార్మిక సమస్యలపై చీఫ్ ఇంజనీర్‌తో జాయింట్ మీటింగ్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానించారు.

గుడ్లు తేలేస్తున్న కోళ్లు

- ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ఉష్ణతాపం
- వేసవిని తలపించే వాతావరణమే కారణం
- 25 శాతం మేర పడిపోయిన గుడ్ల ఉత్పత్తి
- 10 శాతానికి పెరిగిన మరణాల రేటు
- నష్టాలు పాలవుతున్నామంటున్న పౌల్ట్రీ యజమానులు
- ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ లేదని ఆవేదన


చల్లదనం కోసం కోళ్ల ఫారం స్ప్రింక్లర్లతో నీటిని స్ప్రే చేస్తున్న దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: వేసవిని తలపించే ఉష్ణతాపం కోళ్ల పరిశ్రమను విలవిల్లాడిస్తోంది. వర్షాలతో చల్లని వాతావరణం ఉండాల్సిన తరుణంలో ఎండ తీవ్రత పౌల్ట్రీ పరిశ్రమను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సాధారణంగా వేసవి మూడు నెలలు మినహా మిగతా నెలలన్నీ కోళ్లకు అనుకూల వాతావరణమే ఉంటుంది. కానీ ఈ సంవత్సరం పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. వేసవి ముగిసి మూడు నెలలైనా ఇంకా ఎండలు మండిపోతూనే ఉన్నాయి. సాధారణ ం కంటే 3 నుంచి 5 డిగ్రీల వరకు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి భగభగల ధాటికి ఫారాల్లో ఉన్న కోళ్లు గుడ్లు తేలేస్తున్నాయి. వర్షాకాలంలో ఫారాల్లో కోళ్ల మరణాలు 1–2 శాతం కూడా ఉండవు. కానీ కొన్నాళ్లుగా కాస్తున్న ఎండలకు మండు వేసవిలో మాదిరిగా 8–10 శాతం కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. అంతేకాదు గుడ్ల ఉత్పత్తి కూడా గణనీయంగా తగ్గిపోతోంది. అధిక ఉష్ణోగ్రతలతో 25 శాతం మేర గుడ్ల ఉత్పత్తి క్షీణించిందని పౌల్ట్రీ యజమానులు అంటున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు ఎక్కువగా నీళ్లు తాగడం, మేత తక్కువగా తినడం వల్ల గుడ్ల ఉత్పత్తి పడిపోతోందని వీరు చెబుతున్నారు. మరోవైపు బ్రాయిలర్ కోళ్లదీ అదే పరిస్థితి. ఇవి కూడా ఎండల తీవ్రతను తట్టుకోలేక చనిపోతు న్నాయి. అసలే దేశంలో కోళ్ల మేత ధరలు భారంగా మారిన తరుణంలో ఉష్ణ వాతావరణం కొనసాగుతుండడం తమను నష్టాల పాల్జేస్తోందని వీరు ఆవేదన చెందుతున్నారు. కోళ్లు వేసవి ధాటిని తట్టుకోవడానికి పౌల్ట్రీ యజమానులు ఫారాల్లో స్ప్రింక్లర్ల ద్వారా నీటిని స్ప్రే చేస్తున్నారు. దీంతో కోళ్లు కాస్త ఉపశమనం పొందుతాయి. ప్రస్తుతం అక్టోబర్ నెలలోనూ వీరు ఇంకా స్ప్రింక్లర్లనే కొనసాగిస్తున్నారు. వర్షాలు కురవాల్సిన రోజుల్లో ఇలాంటి వేడి వాతావరణ పరిస్థితి గడచిన 30 ఏళ్లలో ఎన్నడూ చూడలేదని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ చౌదరి 'సాక్షి'కి చెప్పారు.

పెరుగుతున్న కోడిగుడ్ల ధరలు..

ఉత్తరాంధ్ర జిల్లాలో సుమారు 45 కోడిగుడ్ల (లేయర్) ఫారాలున్నాయి. వీటిలో 50 లక్షలకు పైగా గుడ్లు పెట్టే కోళ్లున్నాయి. అలాగే వివిధ బ్రాయిలర్ ఫారాల్లో రెండు కోట్ల కోళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోవడం, ఫారాల్లో కోళ్లు చనిపోవడం వల్ల ఇటు గుడ్లు, అటు చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు పెరుగుతూ ఇప్పుడు విశాఖలో వంద గుడ్ల ధర రూ.540కి, కిలో చికెన్ ధర (స్కిన్‌లెస్) రూ.270కి చేరుకుంది. ఇలా వంద గుడ్లపై రూ.50, కిలో చికెన్‌కు రూ.40 చొప్పున పెరిగింది. మరో రెండు మూడు నెలల పాటు గుడ్ల కొరత కొనసాగుతుందని, ఫలితంగా వీటి ధర మరింత పెరిగే అవకాశం ఉందని పౌల్ట్రీ రంగ నిపుణులు చెబుతున్నారు.